జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 12-6-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 698 పేజీలు: 4 వెల : రూ.7






# 21న కోటి మందితో..
# యోగాంధ్ర

* యోగా చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం
* ప్రతి ఒక్కరూ రోజుకో గంట యోగా చేయాలి
* బారువా తీరాన్ని అంతర్జాతీయంగా అభివృద్ధి చేస్తాం
* ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్
* బ్లూ ఫ్లాగ్ బీచ్‌గా గుర్తింపునకు ప్రణాళికలు
* కలెక్టర్ స్వప్నిల్ దినకర్
* బారువా తీరంలో యోగాంధ్ర
* మత్స్యకారులతో కలిసి యోగాసనాలు

సోంపేట, జూన్11 (వార్త): కూటమి ప్రభుత్వం నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 'యోగాంధ్ర' కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. సోంపేట మండల పరిధిలోని బారువా బీచ్ తీరంలో మత్స్యకారుల థీమ్‌తో నిర్వహించిన ప్రత్యేక యోగా వేడుకల్లో ఆయన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ.. యోగా అనేది దేశానికి ఉన్న పెద్ద సంపద అని, దీని ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని ప్రధాని నరేంద్ర మోడీ ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లక్ష్యంగా ఈనెల 21న రాష్ట్రంలో కోటి మందితో భారీ ఎత్తున యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. బారువా బీచ్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ఇక్కడ రెస్టారెంట్లు ఏర్పాటు చేసి స్థానికులకు పెద్దపీట వేస్తూ ఉపాధి కల్పిస్తామన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి టూరిజం రంగాన్ని బలోపేతం చేయడమే ఏకైక మార్గమని ఆయన ఆకాంక్షించారు. అహ్లాదకరమైన బారువా సముద్రతీరంలో యోగాంధ్ర చేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. దేశంలో ప్రస్తుతం 12 బ్లూ ఫ్లాగ్ బీచ్‌లు మాత్రమే ఉన్నాయని, 13వ బీచ్‌గా బారువా సముద్ర తీరాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. ప్రపంచ పర్యాటకులు ఇటువైపు చూసేలా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దేందుకు స్థానిక ఎమ్మెల్యేతో ఇప్పటికే చర్చించినట్లు వెల్లడించారు. బ్లూ ఫ్లాగ్ బీచ్‌గా గుర్తింపు తెచ్చేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యాటకులు, స్థానికులు కలిసి సముద్రతీర పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అప్పుడే ఈ గుర్తింపు ప్రక్రియ త్వరగా పూర్తివుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా మత్స్య శాఖ ఉపసంచాలకులు సుమలత, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ ఉత్తం రాజ్ రాణా పాల్గొన్నారు. యోగా శిక్షకులు పాండ్రంకి మురళీకృష్ణ, కొంక్యాన మురళీధర్, పతంజలి యోగా గురువులు నాగలక్ష్మి, లక్ష్మి, గాయత్రి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురువు కల్పన శిక్షణ ఇచ్చారు. పెద్దమ్మ కోలాటం ట్రూప్ మేరుగు శారద శిష్య బృందం, శ్రీ నటరాజ నాట్య మండలి బిందు కామేశ్వరి శిష్య బృందం ప్రదర్శించిన నృత్యాలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. బారువా, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# ఘనంగా హరిహరాత్మక విశ్వశాంతి యజ్ఞం

**సోంపేట, జూన్ 11(వార్త):** కంచిలి మండలం జే బైరిపురం గ్రామంలో గ్రామ శాంతి కోసం నిర్వహించిన హరిహరాత్మక విశ్వశాంతి మహా యజ్ఞం మూడు రోజులు పాటు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ప్రారంభమైన ఈ మహాకార్యం గురువారంతో పూర్తయింది. గురువారం ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి పలువురు వైసీపీ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు పాల్గొని గ్రామశాంతికి అభివృద్ధికి భగవంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ తో పాటు పలువురు వైసిపి నేతలను గ్రామ పెద్దలు దుస్సాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు దుర్గాసి ధర్మారావు, లద్దు కేశవ పాత్ర, తలగాన తిరుపతి, కొనపల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



### లో వోల్టేజ్ అధిగమించేందుకు

# నూతన ట్రాన్స్‌ఫార్మర్లు

**విద్యుత్ శాఖ ఈఈ(ఆపరేషన్) గుళ్ళ యజ్ఞేశ్వరరావు**




**పలాస, జూన్ 11 (వార్త):** పలాస, సోంపేట సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ వినియోగదారులకు లో వోల్టేజ్ సమస్య అధిగమించేందుకు అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేశామని పలాస ఈఈ( ఆపరేషన్స్) గుళ్ల యజ్ఞేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 220 కేవీ స్థాయిలో విద్యుత్ సమస్యలు ఎగుడు..దిగుడు అవుతుందని, వేసవిలో ఏసీల వినియోగంతో.. లోడ్ విపరీతంగా పెరుగుతోందని, దీంతో అనేక విద్యుత్ సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు. దీనిని సరి చేసేందుకు తమ సిబ్బంది అప్రమత్తంగా ఉంటున్నారని తెలిపారు. ఇటీవల గ్రామీణ ప్రాంతాలలో జరుగుతున్న సంబరాలు వలన కూడా ఎక్కువ విద్యుత్ లోడ్ ఖర్చు అవుతోందని, వేసవిలోనే వినియోగదారులకు విద్యుత్ సమస్యలు ఎక్కువ అవుతున్నాయని తెలిపారు. 2025లో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 231 విద్యుత్ స్తంభాలను మరమ్మతులు చేపట్టామని, దీనిలో భాగంగా సోంపేట సబ్ డివిజన్‌లో 172 విద్యుత్ స్తంభాలు మార్చమని తెలిపారు. ఇచ్ఛాపురం ప్రాంతంలో 39, పలాస ప్రాంతంలో 20 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఉచితంగా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో లో వోల్టేజ్ సమస్య ఉన్న ప్రాంతాలలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నా..ఆయా ప్రాంతాల ప్రజలు స్థలాలను కేటాయించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి సమస్యలు ఏర్పడినా..తన దృష్టికి తీసుకురావాలని 9440907281 నెంబర్‌కు తెలియజేయాలని ఆయన కోరారు.

# నేడు పలాసలో వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన ర్యాలీ


**- ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వైఎస్సార్ స్క్వేర్ వరకు నిర్వహణ**

**- కూటమి మోసాలను ఎండగడతాం**

**- మాజీ మంత్రి అప్పలరాజు**

**పలాస, జూన్ 11(వార్త):** "వెన్నుపోటుకు రెండేళ్లు భారీ నిరసన ర్యాలీ శుక్రవారం పలాసలో జరగనుంది. ప్రజా వ్యతిరేక కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు వైయస్సార్ కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు, పలాస నియోజకవర్గంలో నిర్వహిస్తున్నామని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తెలిపారు. ఉదయం 10 గంటలకు పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నుంచి ప్రారంభమయ్యే ఈ భారీ ర్యాలీ కాశీబుగ్గ వైఎస్సార్ స్క్వేర్ వరకు కొనసాగుతుందని ఆయన వెల్లడించారు. ఈ ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, రైతులు, కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన "సూపర్ సిక్స్" హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, మహిళలకు ప్రకటించిన పథకాలు, యువతకు ఉద్యోగ అవకాశాలు, రైతులకు మద్దతు, విద్యార్థులకు సంక్షేమ కార్యక్రమాలు కేవలం ఎన్నికల హామీలకే పరిమితమయ్యాయని డాక్టర్ సీదిరి అప్పలరాజు విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజలపై ఆర్థిక భారం మోపాయని, నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని, మెగా డీఎస్సీ నియామకాల విషయంలో కూడా నిరుద్యోగులను నిరాశపరిచిందని ఆయన ఆరోపించారు. ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, ఈ రెండేళ్ల పాలన ప్రజలకు అభివృద్ధి కాకుండా వెన్నుపోటుగా మారిందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ఎన్నికల హామీల అమలు కోసం నిర్వహిస్తున్న ఈ నిరసన ర్యాలీని పలాస నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కోరారు.



# బహిరంగ ప్రదేశాల్లో మాంస విక్రయాలు నేరం

**పలాస మున్సిపల్ కమిషనర్ ఐ.శ్రీనివాసులు**

**పలాస, జూన్ 11 (వార్త):** బహిరంగ ప్రదేశాల్లో మాంస విక్రయాలు చట్టరీత్య నేరమని పలాస మున్సిపల్ కమిషనర్ ఐ.శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో ఉన్న చికెన్, మటన్ షాప్ ల యజమానులతో కమిషనర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ సదరు వ్యాపారస్తులతో మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలో ఎవరు కూడా రోడ్డు మార్జిన్ లలో మటన్, చికెన్ షాపులు నిర్వహించకూడదని, వారు కేవలం పురపాలక సంఘమునకు సంబంధించిన షాపు రూములలో లేదా ప్రైవేట్ షాపు రూములలో మాత్రమే సదరు షాపులను నిర్వహించి వ్యాపారం చేసుకొనవ. అలా కాకుండా ఎవరైనా ఆరుబయట మాంస విక్రయం జరిపినట్లేనా వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొనడం జరిగుతుందని కమిషనర్ ఐ శ్రీనివాస్ వారిని హెచ్చించారు. ఈ సమావేశంలో మాంసం విక్రయదారులతోపాటు మున్సిపల్ డి ఈ ఈ శ్రీకర్, మున్సిపల్ రెవిన్యూ ఇన్స్పెక్టర్ అమర్, ఇన్చార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ ఉదయ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాలల పునఃప్రారంభానికి సర్వం సిద్ధం

**-పారిశుధ్య పనులను పరిశీలించిన ఎంఈఓ**




**సారవకోట, జూన్ 11(వార్త):** వేసవి సెలవుల అనంతరం శుక్రవారం నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో విద్యాసంస్థల్లో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. విద్యార్థులకు మెరుగైన వాతావరణంలో బోధన అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పారిశుధ్య చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో జలుమూరు, సారవకోట మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను గురువారం మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) మద్దు వెంకటరమణ స్వయంగా పరిశీలించారు. పాఠశాల ప్రాంగణాల పరిశుభ్రత, తరగతి గదుల నిర్వహణ, తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల పరిస్థితి తదితర అంశాలను పరిశీలించి సంబంధిత సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. సారవకోట మండలం బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన, విద్యార్థుల రాకకు ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జి. రాము, సిబ్బంది గార కృష్ణ తదితరులు పాల్గొన్నారు. పాఠశాలల పునఃప్రారంభం నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.



### ప్రధాన రహదారి పక్కనే ..

# చెత్త కుప్పలు

**- చీడిపూడిలో దుర్వాసనతో ప్రజలకు ఇబ్బందులు**

**- పారిశుధ్య నిర్వహణపై స్థానికుల ఆగ్రహం**

**సారవకోట, జూన్ 11(వార్త):** సారవకోట మండలం చీడిపూడి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రధాన రహదారుల పక్కనే చెత్త కుప్పలు పేరుకుపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. చెత్త నుంచి వెలువడుతున్న దుర్వాసనతో రాకపోకలు సాగించే ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రమంలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించడం లేదనేందుకు ఇదే ప్రత్యక్ష నిదర్శనమని స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా గ్రామంలోని కళ్యాణ మండపం నుంచి బస్టాండ్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే చెత్త పేరుకుపోయి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు, పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. వేసవి కాలంలో చెత్త కుప్పల నుంచి దుర్వాసన మరింత ఎక్కువగా వస్తుండటంతో పాటు దోమలు, ఈగలు పెరిగే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిశుభ్రమైన వాతావరణం కల్పించాల్సిన స్థానిక సంస్థలు చెత్త తొలగింపులో నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శిస్తున్నారు. ప్రధాన రహదారి పక్కనే చెత్త పేరుకుపోవడం గ్రామ పరిశుభ్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని, వెంటనే చెత్తను తొలగించి పారిశుధ్య చర్యలను ముమ్మరం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామంలో నిత్య పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టి చెత్త నిల్వలు లేకుండా చూడాలని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# రైతులకు వరి విత్తనాల పంపిణీ

**- ఖరీఫ్ సీజన్ సాగుకు సిద్ధమవుతున్న రైతులు**

**- ధర్మలక్ష్మీపురం సచివాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ**

**సారవకోట, జూన్ 11(వార్త):** ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను అందించేందుకు వ్యవసాయ శాఖ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా గురువారం సారవకోట మండలం ధర్మలక్ష్మీపురం గ్రామ సచివాలయంలో రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ సిబ్బంది మాట్లాడుతూ, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేపట్టే రైతుల కోసం స్వర్ణ, సాంబ, తెల్ల స్వర్ణ రకాల విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులు తమ సాగు అవసరాలకు అనుగుణంగా విత్తనాలను తీసుకుని వినియోగించుకోవాలని సూచించారు. ధర్మలక్ష్మీపురం సచివాలయ పరిధికి మొత్తం 150 బస్తాల వరి విత్తనాలు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. అలాగే విత్తన శుద్ధి కోసం ప్రత్యేకంగా పౌడర్ ప్యాకెట్లను కూడా రైతులకు అందజేశారు. విత్తనాలను నాటే ముందు శుద్ధి ప్రక్రియ నిర్వహించడం ద్వారా పంటను వ్యాధులు, తెగుళ్ల నుంచి రక్షించుకోవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. నాణ్యమైన విత్తనాల వినియోగం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని, వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని అధికారులు సూచించారు. విత్తనాల పంపిణీ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ మినహాయించాలి



శ్రీకాకుళం, జూన్ 11(వార్త): పదహారేళ్ల క్రితం కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులు టెట్ క్వాలిఫై కావాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః పరిశీలించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మామిడి భుజంగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బుక్కూరు వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 2028 ఆగస్టు 31లోపు ఉపాధ్యాయులు టెట్ క్వాలిఫై కావాలని నిబంధన పెట్టారన్నారు. 2010లో వచ్చిన విద్యా హక్కు చట్టం 23 (1) సెక్షన్ లో ఉన్న దాన్ని సవరణ చేయాలని, దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి పార్లమెంటులో సవరణ చేసే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. ఉపాధ్యాయ నియామకాల్లో ఎన్నో పరీక్షల్లో ఉత్తీర్ణులై 30 ఏళ్ల అనుభవం గడించిన తరువాత మళ్లీ టెట్ క్వాలిఫై అవ్వాలని చెప్పడంతో ఉపాధ్యాయులు మానసిక ఆందోళన గురవుతున్నారన్నారు. దీంతో విద్యాబోధనకు అంతరాయం ఏర్పడుతుందని, టెట్‌కు బదులుగా బోధనలో మెళకువలు మీద శిక్షణ ఇవ్వాలని కోరారు. ఇవి ఉపాధ్యాయ వృత్తికి ఉపయోగపడతాయని



# బహిరంగ చర్చకు సిద్ధమా?

**-పలాస ఎమ్మెల్యేకు బాబా సవాల్**

**- సమయం, వేదిక**

**ఖరారు చేయాలని సూచన**



**పలాస, జూన్ 11 (వార్త):** తన ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత పలాస ప్రజలు ఓట్లు వేస్తే గెలిచిన పలాస ఎమ్మెల్యేకు మాత్రమే ఉందని, పలాస ప్రజల ఓట్లతో గెలిచి.. నేడు ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా దాగుడుమూతలు ఆడుతున్న ఎమ్మెల్యేకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, తాను అడుగుతున్న ఈ ప్రజా సమస్యలపై 'బహిరంగ చర్చ'కు రాగలరా?" చర్చకు సిద్ధమా? దువ్వాడ శ్రీధర్ బాబా సవాల్ విసిరారు. పలాస జిల్లా మోసమేనని, పలాస జిల్లా ప్రకటించి, చివరి నిమిషంలో ఎందుకు తప్పించారో ప్రజల ముందు తేల్చడానికి సిద్ధంగానే ఉన్నానంటూ ప్రశ్నించారు. లిక్కర్ దోపిడీతో పలాస నియోజకవర్గం వైన్ షాపుల్లో రూ.10, గ్రామాలలో బెల్ట్ షాపుల్లో రూ.50 అదనపు దోపిడీపై సమాధానం చెప్పడానికి సిద్ధమా?, మువ్వల నగేశ్ కుటుంబానికి అన్యాయం జరగడంతో.. ఆ కుటుంబానికి 100 రోజుల్లో న్యాయం చేస్తామన్న 'యువగళం' సభ హామీపై మాట్లాడటానికి సిద్ధమా?, జీడిపప్పు పరిశ్రమపై వేధింపులపై ఏం సమాధానం చెప్తారని నిలదీశారు. పలాస అంటే జీడిపప్పు... జీడిపప్పు అంటే పలాస.. అలాంటిది జూలై 1 నుంచి అమల్లోకి రానున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ కొత్త సర్క్యులర్ ప్రకారం రైతు దగ్గర వ్యాపారస్తుడు జీడిపిక్కలు కొని బండి ఎక్కించే ముందే ఒకసారి ఈ-ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్ తీసుకోవాలని, మళ్లీ అదే జీడిపిక్కలు పరిశ్రమలో జీడిపప్పుగా తయారుచేసి ఎగుమతి చేసేటప్పుడు రెండోసారి లింక్ ఈ-ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్ చూపించాలని, ఒకే వస్తువుపై, ఒకే నియోజకవర్గంలో రెండుసార్లు పర్మిట్లు అడగడం వ్యాపారస్తులను, పరిశ్రమను వేధించడం కాదా? దీనిపై ఎమ్మెల్యే ఎందుకు స్పందించడం లేదన్నారు. పన్నుల భారంతో మున్సిపాలిటీలో ప్రతి ఏటా 15 శాతం ఆటోమేటిక్ ఇంటి పన్ను పెంపు దారుణాన్ని సమర్థించుకోగలరా?, కేవీటీ కులస్థుల హక్కుల కోసం వందలాది మంది విద్యార్థుల ఓబీసీ (ఓబీసీ) సర్టిఫికెట్ల అన్యాయంపై వివరణ ఇవ్వడానికి సిద్ధమా?, భూము ల రక్షణకి, పలాస నియోజకవర్గంలో ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ భూములు, చెరువులు, కొండలు, దేవాదాయ భూములను కంచె వేసి రక్షించే స్ఫూర్తి మీకు ఉందా? దీనిపై మాట్లాడటానికి సిద్ధ మా? సమాధానం చెప్పాల్సిన బాధ్యత పలాస ప్రజలు ఓట్లు వేస్తే గెలిచిన మీరే! ప్రజాస్వామ్యంలో ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సిన కనీస బాధ్యత ప్రజాప్రతినిధిగా మీపై ఉందని తెలిపారు. పలాస ప్రజల సాక్షిగా బహిరంగ చర్చకు వస్తారా?, సమయం, వేదిక మీరే ఖరారు చేయండి.. తాను సిద్ధమేనని ఆయన స్పష్టం చేశారు.




## రైతులకు సకాలంలో ..

# విత్తనాలు, ఎరువులు అందించాలి

**- మండల సర్వసభ్య సమావేశంలో**

**ఎంపీటీసీ సభ్యుల డిమాండ్**

**- చర్యలు తీసుకుంటున్నామని అధికారుల హామీ**

**పోలాకి, జూన్ 11(వార్త):** రానున్న ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని ఎంపీటీసీ సభ్యులు డిమాండ్ చేశారు. గత ఏడాది ఎదురైన ఇబ్బందులు ఈసారి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. గురువారం పోలాకి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చ జరిగింది. మండలంలోని వ్యవసాయ పరిస్థితులు, రైతుల అవసరాలు, ప్రభుత్వ పథకాల అమలుపై సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధ్యక్షురాలు (ఎంపీపీ) ముద్దాడ దమయంతి నాయుడు మాట్లాడుతూ, రైతులు విత్తనాలు, ఎరువుల కొరతతో ఇబ్బందులు పడకుండా సంబంధిత శాఖలు ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే అవసరమైన నిల్వలను సిద్ధంగా ఉంచాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సభలో పాల్గొన్న ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ, గతంలో విత్తనాలు, ఎరువుల సరఫరాలో జాప్యం కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఈ ఏడాది అలాంటి పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన వ్యవసాయ శాఖ అధికారులు, రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సరఫరా వ్యవస్థను పటిష్టపరుస్తున్నామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మోదీ పాలన ఆత్మవిశ్వాసం నింపింది



**సరుబుజ్జిలి, జూన్ 11(వార్త):** మోదీ 12 ఏళ్ల పాలన ప్రజల్లో ఆత్మ విశ్వాసం నిం పిందని బీజేపీ శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల గోవిందా రావు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2014 మే 26న ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన మోదీ ఇప్పటి వరకు ఉన్న జవహర్ లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును అధిగమించారన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టిన ఘనత ఆయన నాయకత్వానిదన్నారు. డిజిటల్ చెల్లిం పుల వ్యవస్థ 'యూపీఐ' ద్వారా దేశ ఆర్థిక రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చా రన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిని ప్రభుత్వం ప్రధాన ఆర్థిక వ్యూహంగా మార్చిం దన్నారు. అలాగే రక్షణ రంగంలో స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన అత్యంత శక్తి వంతమైన ఆధునిక యుద్ధ పరికరాలు తయా రీ ఒక గుర్తింపు తెచ్చిందన్నారు. రాష్ట్రంలో కూడా కూటమి రెండేళ్లు పూర్తి చేసుకోవడంఅభినందనీయమన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

**- అబ్బాయిపేట జంక్షన్ వద్ద ఘటన**

**- దర్యాప్తు చేపట్టిన పోలీసులు**




**జలుమూరు, జూన్ 11(వార్త):** జలుమూరు మండలంలోని అబ్బాయిపేట జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. బుధవారం రాత్రి చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో కె.ఎల్.ఎన్.పేటకు చెందిన ఇలపండ అప్పన్న (66) ప్రాణాలు కోల్పోయారు. స్థానికుల వివరాల ప్రకారం, అప్పన్న చల్లవానిపేట నుంచి నడుచుకుంటూ వస్తుండగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టినట్లు తెలిపారు. ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడగా, ఘటనాస్థలంలోనే మృతి చెందినట్లు సమాచారం. ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనదారుడు సారవకోట మండలం కుమ్మరిగుంట గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలు చేపట్టిన పోలీసులు, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనతో మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. రహదారులపై వాహనదారులు వేగ నియంత్రణ పాటిస్తూ అప్రమత్తంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.

# బడి పిలుస్తోందికి మంచి స్పందన

**- ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యాన్ని వివరించిన ఎంఈఓ శ్రీనివాస్**

**- ముగ్గురు విద్యార్థుల చేర్చేందుకు ముందుకొచ్చిన తల్లిదండ్రులు**



**పోలాకి, జూన్ 11(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచేందుకు చేపడుతున్న 'బడి పిలుస్తోంది' కార్యక్రమానికి పోలాకి మండలం దీర్ఘాసి గ్రామంలో మంచి స్పందన లభించింది. దీర్ఘాసి ఉన్నత పాఠశాల పరిధిలో ఎంఈఓ ఎస్. శ్రీనివాస్ రెడ్డి ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను వారి ఇళ్ల వద్దకు వెళ్లి కలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న విద్యా సౌకర్యాలు, నాణ్యమైన బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ విద్య వంటి అంశాలపై వారికి వివరించారు. గ్రామంలోనే ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించడం ద్వారా విద్యతో పాటు సమయ, ఆర్థిక పరమైన ప్రయోజనాలు కూడా కలుగుతాయని ఎంఈఓ తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని, తల్లిదండ్రులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధికారులు, ఉపాధ్యాయులు ఇచ్చిన వివరాలతో సంతృప్తి చెందిన కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు ముందుకు వచ్చారు. ఈ క్రమంలో ముగ్గురు విద్యార్థులను పాఠశాలలో చేర్పించేందుకు అంగీకరించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి



**సారవకోట, జూన్ 11(వార్త):** సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సారవకోట మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) మోహన్ కుమార్ సూచించారు. గురువారం మండలంలోని చిన్న కిట్టాలపాడు గ్రామ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, సిబ్బంది మూవ్‌మెంట్ రిజిస్టర్, క్యాష్ బుక్స్ తదితర పత్రాలను పరిశీలించి నిర్వహణ తీరుపై ఆరా తీశారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు సమర్థవంతంగా అందించడంలో సచివాలయాల పాత్ర కీలకమని పేర్కొన్న ఆయన, విధి వేళల్లో సిబ్బంది తప్పనిసరిగా కార్యాలయంలో అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలు వివిధ అవసరాల కోసం సచివాలయాలకు వస్తుంటారని, వారి సమస్యలను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రికార్డుల నిర్వహణలో పారదర్శకత పాటించడంతో పాటు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అన్ని సేవలను అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. తనిఖీ సందర్భంగా సచివాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఈఓ

**సారవకోట, జూన్ 11(వార్త):** సారవకోట మండలంలోని బుడితి అంగన్వాడీ కేంద్రాన్ని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) మడ్డు వెంకటరమణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో అందిస్తున్న సేవలు, పిల్లలకు అందజేస్తున్న పౌష్టికాహారంపై వివరాలను పరిశీలించి కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం నాణ్యత, పరిమాణం, మెనూ అమలు తీరును పరిశీలించిన ఎంఈఓ, ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు పౌష్టికాహారం కీలకమని, ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని అన్నారు. అలాగే అంగన్వాడీ కేంద్ర పరిధిలో ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలు ఉన్నట్లయితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కార్యకర్తలకు సూచించారు. అలాంటి పిల్లలను సమీప ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి విద్యా ప్రవాహంలోకి తీసుకురావాలని ఆదేశించారు. చిన్నారుల విద్య, ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి చిన్నారికి చేరేలా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. తనిఖీ సందర్భంగా అంగన్వాడీ కేంద్రం నిర్వహణ, పిల్లల హాజరు, రికార్డులను కూడా పరిశీలించిన ఎంఈఓ అవసరమైన సూచనలు చేశారు. కేంద్రం సిబ్బంది ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని సూచించారు.



# శిథిలావస్థలో కిట్టాలపాడు మినీ బ్రిడ్జి

**- రక్షణ గోడలు లేక**

**ప్రమాదకరంగా మారిన వంతెన**

**- పునర్నిర్మాణానికి నిధులు కేటాయించాలని**

**కాంగ్రెస్ నాయకుల డిమాండ్**



**జలుమూరు, జూన్ 11(వార్త):** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగం సమీపంలోని శ్రీకూర్మం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో కిట్టాలపాడు గ్రామం వద్ద వంశధార కాలువపై నిర్మించిన మినీ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానిక ప్రజలు, భక్తులు, వాహనదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందోననే భయంతో ప్రయాణాలు సాగిస్తున్నామని ప్రజలు చెబుతున్నారు. ఈ మార్గం ద్వారా సుమారు 20 గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం రాకపోకలు కొనసాగిస్తుండగా, శ్రీకూర్మం మరియు శ్రీముఖలింగం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులు కూడా ఇదే మార్గాన్ని వినియోగిస్తున్నారు. వంతెన ఇరుకుగా ఉండటంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఒకదానిని మరొకటి తప్పించుకోవడం కష్టంగా మారిందని, దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు పదేళ్లుగా ఈ సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయినప్పటికీ వంతెన పునర్నిర్మాణంపై స్పష్టమైన చర్యలు లేకపోవడం, నిధుల మంజూరు విషయమై ఎలాంటి హామీ లేకపోవడం విచారకరమని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వంతెన ప్రాంతాన్ని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అన్నాజీ రావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మరియు 2024 శ్రీకాకుళం లోక్‌సభ అభ్యర్థి మామిడి సత్యం, నరసన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుంట కర్ణవీరుడు వీరుడు తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ వంతెన సమస్యను జిల్లా యంత్రాంగం అత్యవసరంగా పరిగణించాలని కోరారు. జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సాంకేతిక అంచనాలు సిద్ధం చేసి అవసరమైన నిధులు కేటాయించి వంతెన పునర్నిర్మాణ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రజల భద్రత దృష్ట్యా తాత్కాలిక రక్షణ చర్యలు కూడా చేపట్టాలని సూచించారు. ప్రాంత ప్రజల రాకపోకలకు కీలకమైన ఈ వంతెన సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

# బీసీలపై చిన్నచూపు తగునా?

**-ఎంజేఆర్ పూలే రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం**

**సోంపేట, జూన్ 11(వార్త):** ఇటీవల రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎంపిక చేసిన నలుగురు సభ్యుల్లో ఒక్కరి మినహాయిస్తే మిగతా ముగ్గురిని అగ్రవర్ణాల నుంచి ఎంపిక చేయడం అత్యధిక జనాభా గల రాష్ట్రంలో బీసీలను అవమానపరచడమేనని ఎం జె ఆర్ పూలే రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఆక్షేపించింది. చట్టసభల్లో అత్యంత ఉన్నతమైన రాజ్యసభకు ప్రజా సమస్యలపై అవగాహన లేని వారు, సామాజిక స్పృహ లేని వారు, కేవలం కార్పొరేట్ రంగాలకు చెందిన వ్యాపారులను తెలుగుదేశం జనసేన పార్టీలు ఎంపిక చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు.. ఈ సమాజంలో బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యలపై నిలదీసే బీసీ గొంతులను అణగదొక్కడమే ఈ రాజకీయ పార్టీల విధానంగా తెలుస్తుందని పేర్కొంటున్నారు. ఈ రాష్ట్రానికి,దేశానికి అవసరమైన ఎంతో విలువైన చట్టాలను రూపొందించే ఇటువంటి సభలో సామాజిక అవగాహన ఉన్నటువంటి అనుభవజ్ఞులు,మేధావులు, విద్యావంతులు ఎంతో అవసరం. అటువంటి నాయకులు ఆయా పార్టీల్లో ఎంతోమంది ఉన్నప్పటికీ కేవలం స్వలాభ్యాక్షతో కేవలం ధనిక వర్గాలకే పార్టీలు ప్రాధాన్యం ఇవ్వడం రాష్ట్ర ప్రజల దురదృష్టం అని పేర్కొంటున్నారు. టిడిపి,జనసేన నామినేట్ చేసిన నలుగురు సభ్యులలో ఒక్క చింతకాయల విజయ్ బీసీ మినహా మిగతా ముగ్గురు ఓసీలను ఎంపిక చేయడం హాస్యాస్పదం. ఈరోజు ఈ సమస్యపై సోంపేటలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో సంస్థ ప్రతినిధులు బీన ఢిల్లీరావు, పోతనపల్లి కామేశ్వర రావు, పల్లి హరిచంద్ర, పాతిన అప్పలస్వామి పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఆమదాలవలస అభివృద్ధి కూనతోనే సాధ్యం

**ఆమదాలవలస, జూన్ 11 (వార్త):** ఆమదాలవలస నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే కూన రవితోనే సాధ్యపడుతుందని నారాయణపురం ప్రాజెక్ట్ చైర్మన్ సనపల డిల్లేశ్వరరావు అన్నారు. ఆమదాలవలస మండలం కొర్లకోట గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రం అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలన్నా, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలన్నా చంద్రబాబు నాయుడు నాయకత్వం రాష్ట్రానికి ఎంతో కీలకమని స్పష్టం చేశారు. అదేవిధంగా ఆమదాలవలస నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపించడానికి, స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కూన రవికుమార్ నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం రాబోయే రోజుల్లో వారిద్దరి నాయకత్వాన్ని బలపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిల్లేశ్వరరావు ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



# సర్‌పై అవగాహన అవసరం

* స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారు చేయాలి
* అర్హులైన వారంతా ఓటర్ల జాబితాలో ఉండాలి
* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, జూన్11(వార్త):** స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారు చేసేందుకు అందరూ పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)-2026 ప్రక్రియపై ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్‌తో కలసి ఈఆర్‌ఓలు, ఈఆర్‌ఓలు, సూపర్ వైజర్లతో గురువారం ఆయన శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. బిఎల్‌ఓలకు కేటాయించిన గృహాలను ఇంటింటికి ఎన్యూమరేషన్‌ను విజయవంతంగా చేయాలన్నారు. బీఎల్‌ఓలు అందరూ ఎన్యూమరేషన్ ఫారం ఫైల్ మెంటైన్ చేయాలని చెప్పారు. ప్రతీ ఫారం (6, 7, 8) నకు అకనాలెడ్జమెంట్ ఉండాలన్నారు. కార్యాలయంలో బిఎల్‌ఓలు కూర్చుండే సీటు ప్రజలకు తెలియాలన్నారు. కార్యాలయంలో ఇప్పటి నుండే ఎఈఆర్‌ఓ సీటు సపరేటు చేసుకోవాలని చెప్పారు. బిఎల్‌ఓలను ప్రజలు గుర్తించే విధంగా ఉండాలన్నారు. కంప్యూటర్ పని తెలిసిన వారు ఉండాలన్నారు. ఫైల్ మెంటైనెన్స్ ఇప్పటి నుండే ప్రారంభించాలని ఆదేశించారు. ఎన్యూమరేషన్లో 1.7.2026 నాటికి 18 సంవత్సరాలు నిండి ఉన్న ప్రతీ ఒక్కరిని ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. బిఎల్‌ఓలు ఇంటింట సర్వే జూలై 14 నాటికి పూర్తి చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ జూలై 14, ఎలక్ట్రోరల్ డ్రాఫ్ట్ పబ్లికేషన్స్ జూలై 21న, క్లైంలు, అభ్యంతరాలు జూలై 21 నుంచి ఆగస్టు 20 వరకు, క్లైంలు, అభ్యంతరాలు డిస్పోజ్ జూలై 21 నుంచి సెప్టెంబర్ 18 వరకు ఉంటుందన్నారు. ఫైనల్ పబ్లికేషన్స్ సెప్టెంబర్ 22న ఉంటుందని వివరించారు. ప్రతీ వారం పొలిటికల్ పార్టీలతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు ప్రత్యేక సమగ్ర సవరణపై ఈఆర్‌ఓలు, ఎఈఆర్‌ఓలు, సూపర్ వైజర్లకు ఓటరు



నమోదు, పోస్ట్ డ్రాఫ్ట్, డిక్లరేషన్ ఫారం, క్లైయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్, ఫారం-6, 7, 8, తదితర అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. మ్యాపింగ్ చేయనివి జాగ్రత్తగా చూడాలన్నారు. పలువురు ఈఆర్‌ఓలు, ఎఈఆర్‌ఓలు వారి అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)-2026 కు సంబంధించి ఎలక్టోరల్ మ్యాపింగ్ లో రాష్ట్ర స్థాయిలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచినందుకు ఎలక్టోరల్ అధికారులను కలెక్టర్ అభినందించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ (ఈఆర్‌ఓలు) కె. సాయి ప్రత్యూష, డిప్యూటీ కలెక్టర్లు పద్మావతి, జి. జయదేవి, లక్ష్మణమూర్తి, లావణ్య, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హెచ్. కూర్మారావు, జిల్లా పరిషత్ సిఈఓ వెంకటరామన్, తహసిల్దార్లు (ఈఆర్‌ఓలు), డిటీలు (సూపర్ వైజర్లు) తదితరులు పాల్గొన్నారు.



## పీఆర్‌సీ, ఐఆర్‌లను తక్షణమే ప్రకటించాలి

**శ్రీకాకుళం, జూన్11 (వార్త):** పీఆర్సీని, ఐఆర్‌ను తక్షణమే ప్రకటించాలని, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలని స్సీ ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు, రాష్ట్ర సంఘ గౌరవ అధ్యక్షులు పోతల దుర్గారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్ను వెంకటరావు డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ ఉత్తరాంధ్ర జిల్లాల సమైక్య ఆధ్వర్యంలో విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాలో ఉద్యోగ విరమణ పొందిన పది మంది ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు ఘనంగా సత్కరించి, సన్మానం జరిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వచ్చిన రేగిడి ఆముదాలవలస మండలం విద్యాశాఖ అధికారి వరప్రసాదరావు, రాజాం మండలం విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్, రిటైర్డ్ తహసిల్దార్ రామప్పుడు, గౌరవ అధ్యక్షులు పోతల దుర్గారావు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్ను వెంకట్రావు ఈ కార్యక్రమానికి విచ్చేశారు. వివిధ కుల సంఘాల ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల పెద్దలకు, సంఘ కార్యవర్గ సభ్యులు కార్యకర్తలకు, అంబేడ్కర్ వాదులు అధిక సంఖ్యలో పాల్గొని సూచనలు సలహాలు అందించారు. సంఘం ఆవశ్యకత, అవసరాన్ని వివరించి ప్రభుత్వ విధానాలను ఉపాధ్యాయ సమస్యలను తెలియజేసి సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ పి ఆర్ సి ని ఐఆర్ ను తక్షణమే ప్రకటించాలని ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలని, ఉపాధ్యాయులు పని భారం తగ్గించాలన్నారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలను తక్షణమే మూసివేయాలని తెలిపారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున మరొక వారం రోజులు వేసవి సెలవులు పొడిగించాలని డిమాండ్ చేశారు. హైస్కూల్లో ప్లస్ టు లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరిం చాలని, తక్షణమే పదోన్నతులు కల్పించాలన్నారు. బ్లాక్‌లాగ్ పోస్టు లను భర్తీ చేసి, తల్లికి వందన పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకే పరి మితం చేయాలని స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల మీద పని ఒత్తిడిని తగ్గించి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని వక్తలు అభిప్రాయపడ్డారు. 2004 తర్వాత వివిధ శాఖలలో నియామకం పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలని, టెట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 12 సమస్యలపై తీర్మానం చేసి ప్రభుత్వం దృష్టి తీసుకువెళ్లి పరిష్కార మార్గానికి కనుక్కోవడానికి సంఘం తన వంతు కృషి చేస్తుందని సం ఘాల పెద్దలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన 10 మంది ఉపాధ్యాయులకు ఉద్యోగ విరమణ వీడ్కోలు అభినందన ఘనంగా నిర్వహించారు. మన జనమే మన బలం... మన సంఘమే మనకు శిరోధార్యం ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. అంబేద్కర్ ఆలోచన విధానాన్ని సమాజంలోకి తీసుకొని వెళ్లే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఆధారపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆవాల అప్పన్న, కింజరాపు నూక రాజు, భూపతి రవికుమార్, అల్లిన తవిటిరావు, వడ్డి పాపారావు, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గౌరీశ్వరరావు, కృష్ణ, అంబేద్కర్ వాదులు, సంఘ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, ఉద్యో గులు, దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

## బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి..

# పరిపాలన అనుమతులు

* ఎమ్మెల్యే ఎన్ఈఆర్ కృషి, చొరవతోనే ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్
* హార్బర్ పూర్తయితే 15వేల మందికి ఉపాధి
* మత్స్యకార కుటుంబాల్లో ఆనందం
* రెండేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యం
* సీఎం చంద్రబాబు కృషి వల్లే సాధ్యం
* ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

**ఎచ్చెర్ల, జూన్11 (జాతీయ వార్త):** ఎచ్చెర్ల నియోజకవర్గ అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలిచే బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.444 కోట్ల పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు నిరంతర కృషి, ప్రత్యేక చొరవతో ఈ భారీ ప్రాజెక్టుకు ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. బుడగట్లపాలెం, చుట్టుపక్కల గ్రామాల మత్స్యకారులు దాదాపు రెండు దశాబ్దాలుగా ఫిషింగ్ హార్బర్ కోసం ఎదురుచూస్తున్నారు. సరైన రేవు సౌకర్యం లేకపోవడంతో తుఫాన్లు, అలల తాకిడికి పడవలు దెబ్బతినడం, వేటకు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడేవి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో మత్స్యకార కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొంది. పలు గ్రామాల్లో మహిళలు హారతులు పట్టి సంబరాలు చేసుకున్నారు. అధికారుల అంచనా ప్రకారం హార్బర్ నిర్మాణం పూర్తయితే ప్రత్యక్షంగా 5,000 మందికి, పరోక్షంగా మరో 10,000 మందికి ఉపాధి లభిస్తుంది. చేపల ఎగుమతులు, ఐస్ ప్లాంట్లు, కోల్డ్ స్టోరేజ్‌లు, బోటు మరమ్మతు కేంద్రాలు, నెట్ తయారీ యూనిట్లు వంటి అనుబంధ పరిశ్రమలు పెద్ద ఎత్తున వస్తాయి. దీంతో ఎచ్చెర్లతో పాటు శ్రీకాకుళం జిల్లా సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు వస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మాట్లాడుతూ, "బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ నిర్మాణం ఎచ్చెర్ల నియోజకవర్గ




చరిత్రలో చారిత్రాత్మక ఘట్టం. మత్స్యకారుల కష్టాలు నాకు తెలుసు. వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తెచ్చాం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మత్స్యకారుల పక్షపాతి. ఆయన సహకారం వల్లే ఇది సాధ్యమైంది" అని అన్నారు. అనుమతులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, సహకరించిన మత్స్య శాఖ మంత్రికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్టు ఆమోదం కోసం అసెంబ్లీలో, సచివాలయంలో పలుమార్లు సమస్యను ప్రస్తావించిన ఎమ్మెల్యే కృషిని మత్స్యకార సంఘాల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు కొనియాడారు. "మా బతుకులు మార్చే నిర్ణయం ఇది. ఎమ్మెల్యే ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు" అని బుడగట్లపాలెం మత్స్యకార సంఘం పేర్కొన్నారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తిచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## రక్త క్యాన్సర్‌పై అపోహలు వీడండి




**శ్రీకాకుళం, జూన్11 (వార్త):** రక్త క్యాన్సర్‌పై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరం ఉందని యశోద హాస్పిటల్స్ - మలక్ పేట యూనిట్ ప్రముఖ హీమటాలజిస్ట్, బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ నిపుణులు డా. ఫరాజ్ అహ్మద్ అన్నారు. గురువారం శ్రీకాకుళంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సరైన సమయంలో పరీక్షలు చేసి చికిత్స పొందితే చాలా మంది రోగులు పూర్తిగా కోలుకునే అవకాశముందని చెప్పారు. అలాగే రక్త క్యాన్సర్ లక్షణాలు సాధారణ అనారోగ్యంగా భావించి నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం ఉందన్నారు. తరచుగా జ్వరం రావడం, అలసట, బలహీనత, ఇన్ఫెక్షన్లు పునరావృతం కావడం, కారణం లేకుండా బరువు తగ్గడం, శరీరంలో గడ్డలు పెరగడం, రక్తస్రావం లేదా నీలి మచ్చలు రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే హీమటాలజిస్ట్‌ను సంప్రదించాలని సూచించారు. బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్‌పై ప్రజల్లో ఉన్న భయాలు అనవసరమని ఆయన పేర్కొన్నారు. ఇది శస్త్రచికిత్స కాదని, రక్త మార్పిడి విధానంలా జరిగే ప్రక్రియ అని తెలిపారు. సరైన రోగి ఎంపిక, తగిన డోనర్, అనుభవజ్ఞులైన వైద్య బృందం ఉంటే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని చెప్పారు. దేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది ఈ చికిత్సతో కోలుకుంటున్నారని వివరించారు. రక్త క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించడం ఎంతో కీలకమని, ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రజల్లో రక్త క్యాన్సర్, బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్‌పై అవగాహన పెరగాలని, అపోహలను నమ్మకుండా నిపుణుల సలహా తీసుకోవాలని తెలిపారు. ఈసందర్భంగా విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల ప్రజలకు యశోద హాస్పిటల్స్ సేవలు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో తాను ప్రతీ నెలా రెండో గురువారం అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ మేనేజర్ నల్లం బాల వీరభద్ర, అసిస్టెంట్ మార్కెటింగ్ మేనేజర్ వెంకటరమణ పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముక

* మనది సిద్ధాంతపరమైన పార్టీ
* మనం ప్రజల పక్షాన నిలబడదాం
* పార్టీ జెండాను రెపరెపలాడిద్దాం
* జాబితా నుంచి మన ఓట్లు తీసేందుకు కుట్ర
* విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు అడ్డుకోని వైసీపీకి మాట్లాడే హక్కు లేదు
* వైసీపీకి రాజకీయ పార్టీగా చెప్పుకునే అర్హత లేదు
* మెగా డీఎస్సీని అడ్డుకోవడానికి 86 కేసులు వేశారు
* ఫేక్ రాజకీయాలు చేయడమే వారి విధానం
* గొడ్డలి పార్టీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి
* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**కోటబొమ్మాళి/సంతబొమ్మాళి, జూన్ 11 (వార్త):** తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నుముక అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గురువారం కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో నియోజకవర్గం పరిధిలోని మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, బూత్ ఇన్‌ఛార్జ్‌లతో ఓటరు జాబితా సమగ్ర సవరణ 'సర్' ప్రక్రియపై జరిగిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో, ఒక సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. 2002 తరువాత మరలా ఇప్పుడు ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియపై క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా తొలగింపునకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గొడ్డలి పార్టీ ఓటర్లను జాబితా నుంచి తొలగించేందుకు 'సర్' ద్వారా కుట్రలు చేస్తుందని, మరింత అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పోలింగ్ బూత్‌ల పరిధిలో బూత్ స్థాయి ఏజెంట్లు అత్యంత జాగరూకతతో వ్యవహరించాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిని పరమావధిగా పెట్టుకుని ముందుకు సాగుతోందని మంత్రి అన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ప్రతి ఇంటికీ చేరేలా చేయాల్సిన బాధ్యత కార్యకర్తలదేనన్నారు. ప్రజలకు ప్రభుత్వ విజయాలను, సంక్షేమ కార్యక్రమాలను గడపగడపకూ తీసుకెళ్లి, ప్రభుత్వంపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో మన బూత్ స్థాయి ఏజెంట్లు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి పేర్కొన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరుకూ అన్యాయం జరగకుండా జాగ్రత్తపడాలని, దొంగ ఓట్లకు ఎలాంటి అవకాశం లేకుండా కట్టుదిట్టంగా వ్యవహరిస్తూ, ఓటర్ల జాబితా రూపకల్పనలో అవకతవకలకు తావులేకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అందుకే ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రతి అర్హుడి ఓటును కాపాడేందుకు కృషి చేయాలని కోరారు. ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన ప్రతి హామీని మా ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. ఐదేళ్ల పాలనలో వైకాపా ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయని వైసీపీ.. 'మెగా డీఎస్సీ'ని అడ్డుకోవడానికి ఏకంగా 86 కేసులు వేసి విఫలమయ్యారన్నారు. మెగా డీఎస్సీపై జగన్ కుట్రలు ఇక సాగవన్నారు. జాబ్ క్యాలెండర్ పేరుతో యువతను మోసం చేసి, వ్యవస్థలను విధ్వంసం చేసిన గొడ్డలి పార్టీ అధ్యక్షుడికి, నేడు విశాఖ స్టీల్ ప్లాంట్‌పై మాట్లాడే నైతిక హక్కు ఎక్కడిది? అని ప్రశ్నించారు. అసలు వారికి రాష్ట్రంలో రాజకీయ పార్టీగా చెప్పుకునే అర్హతే లేదు. ఓటరు జాబితా నుంచి మన ఓట్లను తొలగించి, వారి దొంగ ఓట్లను చేర్చే కుట్రలకు గొడ్డలి పార్టీ వెనకాడదన్నారు. ప్రతి కార్యకర్త, నాయకుడు 'సర్' (ఓటరు జాబితా సవరణ) ప్రక్రియను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. వారి కుట్రలను క్షేత్రస్థాయిలో తిప్పికొట్టాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆస్తులు తనఖా గత ఐదేళ్ల పాలనలో పేద ప్రజలపై భారాలు మోపుతూ, మద్యం ఆదాయం పేరుతో భారీగా అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని వైసీపీ అధినేత జగన్‌పై తీవ్రస్థాయిలో మంత్రి అచ్చెన్న ధ్వజమెత్తారు. ప్రభుత్వ ఆస్తులను సైతం తనఖా పెట్టి సుమారు రూ.10.5 లక్షల కోట్ల మేర అప్పులు చేసిన కారణంగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సమయానికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వెంటిలేటర్‌పై ఉన్నట్లు మారిందని పేర్కొన్నారు. అలాగే విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ దిశగా నెట్టిన పరిస్థితులు కూడా గత ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనమని విమర్శించారు. అయితే సమర్థవంతమైన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రం విధ్వంసం నుంచి వికాసం వైపు పయనిస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడేందుకు రూ. 13 వేల కోట్ల ప్యాకేజీ మంజూరు చేయించడం ద్వారా పరిశ్రమ భవిష్యత్తుకు భరోసా కల్పించారని అన్నారు. దేశంలో ప్రైవేటీకరణ అంచుకు చేరిన ఒక ప్రభుత్వ రంగ సంస్థను మళ్లీ గాడిలో పెట్టేందుకు కృషి చేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం, ఆర్థిక పునరుద్ధరణ, పరిశ్రమల పరిరక్షణ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, తెలుగుదేశం నాయకులు వెలమల కామేశ్వరరావు, తర్ర రామకృష్ణ, రెడ్డి అప్పన్న, నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.

## పది ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం, జూన్ 11(వార్త):** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ఆదేశాల ప్రకారం 2026-27 విద్యా సంవత్సరానికి గాను పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరడానికి ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాలు ప్రారంభమైనట్లు శ్రీకాకుళం జిల్లా విద్యాశాఖాధికారి కె.రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశాల ప్రక్రియ జూన్ 12 నుండి ప్రారంభం కానుండగా, ఆన్‌లైన్ అప్లికేషన్ సమర్పించడానికి జూలై 30 చివరి తేదీ అని పేర్కొన్నారు. సాధారణ ప్రవేశ రుసుమును జూలై 31 లోగా చెల్లించాల్సి ఉంటుం దని, ఒకవేళ ఈ గడువు దాటితే రూ. 200- అపరాధ రుసుముతో ఆగస్టు 1 నుండి ఆగస్టు 15 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారని ఆయన వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమకు సమీపంలో ఉన్న ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ల వద్దకు వెళ్లి, అక్కడి కోఆర్డినేటర్లను సంప్రదించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత వచ్చే రెఫరెన్స్ నెంబర్ ఆధారంగా అభ్యర్థులు స్వయంగా ఏపీ ఆన్‌లైన్ కేంద్రాలకు వెళ్లి ప్రవేశ ఫీజులను చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సార్వత్రిక విద్యా విధానంలో చదువును కొనసాగించాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి రవిబాబు కోరారు.

## యూజీసీ-నెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

**శ్రీకాకుళం, జూన్11 (వార్త):** యూజీసీ- నెట్ పరీక్షలు ఈనెల 22 నుండి 30 వరకు జిల్లాలో సజావుగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. నరసన్నపేటలోని 'కోర్ టెక్నాలజీస్' వేదికగా ప్రతిరోజూ రెండు షిఫ్టుల్లో (ఉదయం 9:00 నుండి మధ్యాహ్నం 12:00 వరకు, మధ్యాహ్నం 3:00 నుండి సాయంత్రం 6:00 వరకు) ఈ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల కాలంలో కేంద్రం వద్ద అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, కచ్చితమైన నిబంధనలతో శాంతిభద్రతలను నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. పరీక్షా కేంద్రం వద్ద తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు పరిసరాల్లోని జిరాక్స్, నెట్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రం చుట్టూ నిషేధాజ్ఞలు అమలు చేయాలని, విద్యుత్ శాఖ అధికారులు నిరంతర విద్యుత్ సరఫరాను నిర్ధారించాలని స్పష్టం చేశారు. అలాగే, అత్యవసర వైద్య సేవల కోసం ప్రథమ చికిత్స సిబ్బందిని నియమించాలని వైద్య ఆరోగ్య శాఖను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి షిఫ్ట్‌కు 300 మంది అభ్యర్థులు హాజరవుతారని ఆ దిశగా ఏర్పాట్లు ఉండాలి అని కలెక్టర్ తెలిపారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546